క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న చిన్నరాజులు

జలుమూరు: సీజనల్ వ్యాధులైన జ్వరం, దగ్గు, మలేరియా తదితర వాటిపై అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ పర్యవేక్షకుడు చిన్నరాజులు అన్నారు. దరివాడలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు. వేడి నీరు తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదర్శనరావు



పాతపట్నం: స్థానిక నీల మణిదుర్గ అమ్మవారి దేవస్థానంలో గుమస్తాగా పనిచేస్తున్న కోడి సుదర్శనరావును పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈయన కోడి రామ్మూర్తి అవార్డు కూడా పొందారు. సుదర్శరావును ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, ఆలయ సిబ్బంది సోమవారం అభినందించారు.

ఎస్ఐగా అనిల్‌కుమార్



సారవకోట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి.అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన ఎస్ఐ అప్పారావును విశాఖపట్నం జిల్లా వీఆర్‌కు పంపించారు. మందస నుంచి అనిల్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నరసన్నపేట ఈఓగా ద్రాక్షాయిని



నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీ ఈఓగా బొరిగివలస పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ద్రాక్షాయినిని జిల్లా పంచాయతీ ఆఫీసర్ నియమించారు. గ్రేడ్ టూ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న ద్రాక్షాయినికి గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించింది. ఆమెను నరసన్నపేట ఈఓగా నియమించడం జరిగిందని ఎంపీడీఓ మధుసూదనరావు సోమవారం తెలిపారు. ఇంతవరకు ఈఓగా డిప్యూటేషన్‌పై సవర చిన్నారావు పనిచేశారు. మడపాం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జగన్నాథరావు ఉద్యోగోన్నతిపై టెక్కలి మేజర్ పంచాయతీ ఈఓగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ ఆఫీసర్ ఆదివారం ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సారవకోట: మండల కేంద్రంలోని స్వర్ణమణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న పాతపట్నం అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి క్షీరాభిషేకం, సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక, విశేష పూజలను రుత్వికులు సంతోష్‌శర్మ భక్తులతో చేయించారు.

శ్రీముఖలింగానికి భక్తుల తాకిడి



క్యూలో ఉన్న భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శ్రావణ మాసం మూడో సోమవారం భక్తుల తాకిడి కనిపించింది. గత రెండు రోజులు సెలవులు కావడంతో భక్తులు తరలివచ్చారు. స్వామికి తలనీలాలు అర్పించి, ఆలయ గర్భగుడిలో ఉన్న గోలెంకు మొక్కులు తీర్చారు. ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు. మధుకేశ్వరుడిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: మండలంలోని తెంబూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో యోగా శిక్షకులుగా పనిచేయడానికి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యురాలు ఎస్.ఉమాగౌరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ, డిగ్రీతోపాటు యోగా డిప్లమా ఉండాలని, యోగాలో అనుభవం ఉంటే అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులను వైద్యశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు వైద్యశాలను సంప్రదించాలన్నారు.



భద్రత కట్టుదిట్టం చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో పనిచేయడం మహిళా సిబ్బందికి సవాల్‌గా ఉంటుంది. పీహెచ్‌సీ వద్ద సెక్యూరిటీని నియమించాలి. మా పీహెచ్‌సీ ఎదురుగా మద్యం దుకాణం ఉంది. పలుమార్లు పోలీసులకు తెలియజేశాం. పోలీసులు వచ్చి కొద్ది రోజులే ఉన్నారు. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం దారుణం. నల్లబాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నాం.

– గొలివి సుజాత, వైద్యాధికారి, ఉర్లాం పీహెచ్‌సీ, నరసన్నపేట మండలం

సెక్యూరిటీని నియమించాలి

రోగులకు వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బందికి రక్షణ లేకుండా పోతోంది. మెట్టూరు పీహెచ్‌సీ వద్ద సెక్యూరిటీ గార్డులు లేరు. ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు జరుగుతున్నందున వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. లేకుంటే రాత్రి సమయంలో విధులు నిర్వహించడం కష్టంగా ఉంటుంది. దీనిపై ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– బి.శ్రావణి స్టాఫ్‌నర్స్, మెట్టూరు పీహెచ్‌సీ, కొత్తూరు మండలం



ప్రారంభానికి నోచుకోని.. అదనపు భవనం

- నాయకులకు సమయం లేదని తత్సారం
- లుకలాం హైస్కూల్ విద్యార్థులకు తప్పని కష్టాలు
- రూ.1.20 కోట్లతో సిద్ధమైన నాలుగు తరగతి గదులు



నూతనంగా నిర్మించిన అదనపు భవనం

నరసన్నపేట: కేవలం అధికార పార్టీ నాయకులకు తీరకలేదని మండలంలోని లుకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల అవస్థల కంటే వారి సొంత పనులకే ప్రాధాన్యత ఇచ్చి భవనాలను వినియోగంలోనికి తీసుకురావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

తరగతి గదులు సిద్ధం..

వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కూల్ స్థితిగతులు మారాయి. నాడు–నేడు పథకం ద్వారా రూ.1.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.1.20 కోట్ల వరకు ఖర్చు చేసి నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించారు.

మౌలిక సదుపాయాల కల్పన..

లుకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 118 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తరగతి గదులు మాత్రం కేవలం మూడే ఉన్నాయి. స్కూల్ వ్యవస్థాపన సమయంలో నిర్మించిన ఐదు తరగతి గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రమాదం పొంచి ఉన్న దృష్ట్యా వీటిల్లో తరగతులు నిర్వహించడం లేదు. ఈ దశలో గత ప్రభుత్వం హయాంలో విద్యా కమిటీ మాజీ చైర్మన్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. అవసరమైన మేరకు కొత్త బెంచీలు ఏర్పాటు చేశారు. ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించారు.

రేకుల షెడ్‌లో తరగతుల నిర్వహణ..

ఉన్న విద్యార్థులకు తరగతి గదులు సరిపోక రేకుల షెడ్‌లో ప్రస్తుతం ఐదు, ఆరు తరగతులను నిర్వహిస్తున్నారు. మిగిలిన తరగతులను మూడు గదుల్లోనే కొనసాగిస్తున్నారు. కేవలం నాయకులకు తీరిక లేదనే షాకు చెప్పి నూతన తరగతి గదులను వినియోగంలోనికి తీసుకురావడం లేదు. ఇప్పటికైనా కొత్తగా నిర్మించిన తరగతి గదులను వినియోగంలోనికి తీసుకురావాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తరగతి గదుల్లో ఏర్పాట చేసిన బెంచీలు



రేకుల షెడ్ కింద నిర్వహిస్తున్న ఐదో తరగతి

మదర్ థెరీసా సేవలు మరువలేనివి



పాతపట్నం: మదర్ థెరీసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ వెంకటరమణ, తదితరులు

నరసన్నపేట: మదర్ థెరిసా సేవలు మరువలేనివని నరసన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు అన్నారు. మదర్ థెరీసా జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో ఉన్న ఆమె విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి కలివరపు సాయిరాం, ప్రతినిధులు రమేష్, బాలకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మదర్ థెరీసా ఓ మహోన్నత వ్యక్తి అని సారవకోట ఎంఈఓ వెంకటరమణ అన్నారు. మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మదర్ థెరీసా జయంతిని సోమవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న థెరిసా విగ్రహానికి నివాళులర్పించారు. హెచ్ఎం బి.సింహాచలం, ఎంజేబీజీ ప్రిన్సిపాల్ జి.శ్రీరాములు, ఎస్.రామరాజు, బి.అనిల్ కుమార్, ఫిలిఫ్, బెహరా, మీనా కుమారి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మదర్ థెరీసా సేవలు స్ఫూర్తిదాయకమైనవని అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో అరుణోదయ ఆదరణ నిలయంలో సోమవారం మదర్ థెరీసా జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. కె.బాలలక్ష్మి, రిక్షా కార్మికుల సంఘ అధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మదర్ థెరీసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



ఆమదాలవలస: మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలవేస్తున్న సంస్థ డైరెక్టర్, వృద్ధులు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీఎస్సీ–2002 హిందీ పండిట్ల పెన్షన్ సాధన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దూపాన తవిటిరెడ్డి, నవగాన రత్నకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం ప్రవేశానికి ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్‌తోపాటు గ్రాట్యుటీ, డీఆర్ ఇస్తామని ప్రకటించారన్నారు. ఉద్యోగులందరూ పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)లో ఉన్న ప్రయోజనాలను మాత్రమే కోరుకుంటున్నామని తెలిపారు.

నూతన పెన్షన్ విధానం ఆమోదయోగ్యం కాదు



ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామమూర్తి

నరసన్నపేట: ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానమే ఏకైక పరిష్కారమని, మరే ఇతర పెన్షన్ విధానాన్ని అంగీకరించే ప్రశక్తి లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామమూర్తి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పేరుతో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇది అంగీకారం కాదన్నారు. 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారెంటీ చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించందన్నారు. సర్వీసులో మరణించిన వారి కుటుంబాలకు 60 శాతం కుటుంబ పెన్షన్ ఇస్తామని వెల్లడించిందన్నారు. చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని తప్పుబట్టారు. పైగా ఐచ్ఛికం అని ప్రస్తావించడంలోనే అసలు మోసం ఉందని, దీనిని ఉద్యోగులు గమనించి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఒక్క రూపాయి ఉడా చందా చెల్లించకుండానే సర్వీస్ మేరకు 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పరామర్శ..



పోతయ్యవలసలో వెంకటరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మండలం పోతయ్యవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అరవల వెంకటరావు, పాలకొండపేటకు చెందిన పార్టీ కార్యకర్త పాలకొడ రామారావు ఇటీవల మృతి చెందారు. ఆ కుంటుబాలను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. గోపాలపెంటలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గొర్లె రామారావును పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, బొబ్బాది ఈశ్వరరావు, కనపల శేఖర్, తోట భార్గవ్, అరవల సుధాకర్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలోని బుడితి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు టెక్కలి ఈఈ శంకరరావు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేస్తామన్నారు. బుడితి, అవలింగి, చీడిపూడి, బద్రి, కిన్నెరవాడ, గుమ్మపాడు, అక్కివలస, బైదాలాపురం గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

అకౌంట్స్ ఆఫీసర్‌గా గంగాధరరావు



ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన కరగాన గంగాధరరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్–నేషనల్ బ్యూరో ఆఫ్ సోయల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్, నాగపూర్‌లో అసిస్టెంట్ ఫైనాన్స్, అకౌంట్స్ అధికారిగా నియమితులయ్యారు. ఇప్పటివరకు కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థలో ఉద్యోగం చేశారు. గంగాధరరావుకు అకౌంట్స్ ఆఫీసర్‌గా నియామక ఉత్తర్వులు రావటంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు కరగాన పోలయ్య, సుజాత వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన సోదరుడు మురళీధర్ ఇదే మండలం పెద్దకొల్లివలస ప్రాథమికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

'మెండ'కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను అందుకుంటున్న రామారావు

జలుమూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న మెండ రామారావుకు డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్‌ను సోమవారం విశాఖపట్నంలో ప్రదానం చేశారు. చేయూత ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సిటీ చైర్మన్ పాల్ శ్యామల్ డాక్టర్‌ను అందించారు. భారతీయ విద్యా విధానం, ప్రపంచీకరణలో తీసుకువచ్చిన మార్పులపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ దక్కిందని రామారావు తెలిపారు. చాన్సలర్ అమస్‌జేమ్స్, పలువురు సాహిత్య వేత్తలు పాల్గొన్నారు. రామారావుకు డాక్టరేట్ దక్కడంపై ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఊరూరా అంగరంగ వైభవంగా సోమవారం జరిగాయి. రాధాకృష్ణ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో అష్టమి వేడులను నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణుడుగా, గోపికలుగా, రాధాకృష్ణులుగా ఆకట్టుకున్నారు. గ్రామాల్లో చిన్ని కృష్ణుడుకి ఊయల సేవ, ఉట్టికొట్టే ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. ఉట్టికొట్టేందుకు యువకులు, చిన్నారులు పోటీపడ్డారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదానాలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు భాగస్వాములయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: మండల కేంద్రంలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



పొందూరు: శ్రీకృష్ణుడి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆనందోత్సవాల మధ్య ఉట్టిని కొడుతున్న విద్యార్థిని



పాతపట్నం: గోపాలకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



ఆమదాలవలస: సత్యసాయి బాబా ఆలయంలో భగవద్గీత పఠిస్తున్న మహిళలు



హిరమండలం: ప్రేమసాయి వృద్ధాశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: జేబీటీ పాఠశాలలో శ్రీకృష్ణుడు, రాధ వేషధారణల్లో చిన్నారులు



కొత్తూరు: బీవీకే పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు



పాతపట్నం: పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో కృష్ణుడుకి పూజలు చేస్తున్న దృశ్యం



నరసన్నపేట: విశ్వభారతి స్కూల్ ఆవరణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సారవకోట: కిన్నెరవాడలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ

చెట్లు నరికివేత



మొదులు వరకు కొట్టిన చింత చెట్టు

సారవకోట: మండల పరిషత్ ఆవరణలో ఎన్నో ఏళ్ల నాటి భారీ చింత, సిరిసిం చెట్లను సోమవారం కొందరు వ్యక్తులు నరికివేశారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్లను కొట్టుకుని తరలించుకుపోయినా ఎవరూ పట్టించుకోలేదు. మండల పరిషత్ సమావేశ మందిరానికి పెయింటింగ్ వేస్తున్నారు. ఆ సమయంలో కొన్ని కొమ్మలుగా అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించేందుకు ఒక వ్యక్తిని పురమాయించారు. ఆ వ్యక్తి ఇదే అదునుగా సోమవారం సెలవు దినం కావడంతో చెట్లను నరికి వాటిని తరలించుకుని పోయాడు. దీనిపై ఎంపీడీఓ రాంబాబును వివరణ కోరగా.. త్వరలో ఎంపీడీఓ కార్యాలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, చెట్ల కొమ్మలు తొలగించాలని చెప్పామన్నారు. చెట్లు నరికి తీసుకెళ్లడం తమ దృష్టికి రాలేదన్నారు.

11 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. మెళియాపుట్టి మండలం నందవ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 11 ఒడిశా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. వీటి విలువ రూ.2,130 ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనం సీజ్ చేశామని, వీరి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

● గోతులమయం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వంశధార నిర్వాసితుల ముంపు గ్రామం రోడ్డు కాదు. కొత్తూరు మండలంలోని నివగాం నుంచి హిరమండలం మండలంలోని గులుమూరు వెళ్లే రహదారి (జీఎస్ రోడ్డు). ఇటీవల కురిసిన వర్షాలకు గోతులమయంగా మారింది. అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ నుంచి లారీలు, ట్రాకర్లు ఈ రోడ్డులోనే రాకపోకలు సాగించడంతో మరింత అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో ప్రయాణం నరకయాతనగా మారింది. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– కొత్తూరు